ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
గురువారం 10 అక్టోబరు 2024

నేటి అలంకారం
శ్రీదుర్గాదేవి



బుధవారం తెల్లవారుజామున



మధ్యాహ్నం



రాత్రి



భక్తజనకీలాద్రి

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తజనం



క్యూలైన్లలో భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) సరస్వతీదేవిగా దుర్గమ్మ

జనం జనం జనం.. కొండంత జనం క్యూ కట్టింది. క్యూలైన్లు.. ఆలయ పరిసరాలు.. రహదారులు ఎక్కడచూసినా వెల్లువలా కదిలింది. మూలా నక్షత్రం రోజున సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మను చూసేందుకు తండోపతండాలుగా తరలివచ్చింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు కదలిరావడంతో ఇంద్రకీలాద్రి భక్తజనకీలాద్రిగా కనిపించింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం అర్ధరాత్రి వరకూ రద్దీ కొనసాగింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించడంతో దర్శనాలు సాఫీగా సాగాయి. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చిన భక్తులు దర్శనానంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించి తిరుగు పయనమయ్యారు. కుంకుమార్చనలు, అక్షరాభ్యాసాలు, సువాసినీ పూజలు, నగరోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చాయి.



సీఎం చంద్రబాబు కుటుంబానికి వేదాశీర్వచనం



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమార్తెకు దుర్గమ్మ చీర ఇస్తున్న ఈవో

మూలా నక్షత్రం రోజు భారీగా రాక

- అన్ని క్యూలు ఉచితంగా అనుమతి
- అర్ధరాత్రి వరకూ తగ్గని రద్దీ
- సుమారు 2 లక్షల మంది వచ్చారని అంచనా
- మూడు గంటల్లోనే పూర్తయిన దర్శనం
- దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు కుటుంబం
- దుర్గమ్మ సేవలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



విజయవాడ/చిట్టినగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. మూలా నక్షత్రం రోజు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మను చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. దీంతో రాత్రి ఒంటిగంట తర్వాత దర్శనాలు మొదలుకావాల్సి ఉండగా, 12 గంటలకే ప్రారంభించారు. క్యూలన్నీ నిండిపోవడంతో పోలీసులు హోల్డింగ్ ఏరియాలను ఏర్పాటు చేశారు. పోలీసు కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్‌పై వరకు హోల్డింగ్ ఏరియాలు ఏర్పాటు చేశారు. అన్ని క్యూలను ఉచితంగా వదిలేశారు. భక్తులకు ఒక లడ్డూను ఉచితంగా అందజేశారు. ఆలయం మూసివేసే సమయానికి సుమారు 1.50 లక్షల నుంచి 2 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారని అంచనా. గంటకు 6 వేల నుంచి 7 వేల మంది దర్శనానికి వచ్చినట్టు అధికారులు తెలిపారు. వినాయకుడి గుడి వద్ద క్యూలోకి వెళ్లిన భక్తులకు అమ్మవారి దర్శనం కావడానికి 3 గంటల సమయం పట్టింది. కాగా, దుర్గమ్మకు బుధవారం సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎంపీ కేశినేని చిన్ని, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



కుంకుమార్చన అనంతరం నక్షత్ర హారతి

ట్రాఫిక్‌తో అవస్థలు





మూలా నక్షత్రం కావడం, భక్తుల రద్దీ పెరగడం, వీఐపీల తాకిడితో బుధవారం నగరం పద్మవ్యూహాన్ని తలపించింది. కనకదుర్గ ఫ్లై ఓవర్‌తో పాటు వన్‌టౌన్, కాళేశ్వరరావు మార్కెట్, బస్టాండ్, రైల్వేస్టేషన్, లోబ్రిడ్జి వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఏమా వెండి కథ

ఆర్టీసీ బస్సులో అక్రమంగా వెండి రవాణా



- పెడన నుంచి విశాఖకు 25 కేజీలు సరఫరా
- ఎలాంటి బిల్లులు లేని వెండిని పట్టుకున్న స్క్వాడ్
- తిరిగి పార్టీకి అప్పగించేసిన అధికారులు
- కేసు పెట్టకుండా అప్పగించడంపై అనేక ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కార్గో రవాణా ముసుగులో ఆర్టీసీ బస్సుల్లో అక్రమంగా వెండి రవాణా అవుతుండటం కలకలం రేపుతోంది. గత నెలలో బందరు నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులో అక్రమంగా 25 కేజీల వెండి రవాణా కావటం, అది పట్టుబడటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో ఎలాంటి కేసు నమోదు చేయకుండా సీజ్ చేసిన వెండిని సదరు యజమానికి అప్పగించేశారు. స్క్వాడ్ అధికారులు, వెండి యజమానులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వస్తున్నాయి. సెప్టెంబరు 28వ తేదీన మచిలీపట్నం నుంచి విశాఖపట్నం బయల్దేరిన ఆర్టీసీ బస్సు పెడనకు రాగా, అక్కడ ఎలాంటి బిల్లులు లేని 25 కేజీల వెండిని అక్రమంగా లోడ్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న రీజనల్ ఆర్టీసీ స్క్వాడ్ బృందం ఆ బస్సులో ఎక్కి విశాఖపట్నం వరకు వెళ్లింది. విశాఖపట్నంలో సరుకు దింపుతుండగా, స్క్వాడ్ అధికారులు బిల్లులు లేని వెండిని గుర్తించి సీజ్ చేశారు. ఇక్కడి నుంచి కథ మలుపు తిరిగింది. వెండిని సీజ్ చేసిన విషయం తెలుసుకున్న యజమానులు అక్కడకు వచ్చారు. ఏం జరిగిందో తెలియదు కానీ.. సీజ్ చేసిన బిల్లులు లేని వెండిని స్క్వాడ్ అధికారులు వారికి అప్పగించేశారు. సాధారణంగా సీజ్ చేసిన వాటిని పార్టీలకు ఇవ్వకూడదు. స్థానిక పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి కేసు పెట్టాలి. లేదంటే.. మచిలీపట్నం బస్ డిపోకైనా అప్పగించాలి. ఇవేమీ చేయకుండా సదరు వెండిని యజమానులకు అప్పగించేయడం వెనుక కథ ఏమిటన్న ఆరోపణలు వస్తున్నాయి.

రహస్యంగా..

ఆర్టీసీలో విజిలెన్స్ విభాగం ఎంతగా నిద్రపోతోందో ఈ సంఘటన ద్వారా తెలుస్తుంది. ఈ వెండికి ఎలాంటి బిల్లులు లేవు. బిల్లులు లేకుండా రవాణాకు వస్తే వాణిజ్య పన్నుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఆ పని కూడా చేయలేదు. బిల్లుల్లేని ఈ వెండిని కార్గో రవాణాలో భాగంగా అధికారికంగా బుకింగ్ కూడా చేయలేదు. కేవలం డ్రైవర్‌కు ఇస్తే ఆయన తన సీటు కింద పెట్టుకుని రవాణా చేయటం గమనార్హం. ఈ బస్సులో ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. ఇద్దరికీ వెండి రవాణా విషయం తెలుసు. సాధారణంగా అయితే, ఆ ఇద్దరు డ్రైవర్లకు చెకింగ్ స్క్వాడ్ అధికారులు చార్జిమెమోలు ఇవ్వాలి. ఎస్ఆర్‌లో నమోదు చేయాలి. కానీ, ఈ వ్యవహారంలో మాత్రం స్క్వాడ్ అధికారులు రహస్యంగా ఉండిపోయారు.

విజిలెన్స్ దృష్టి సారించేనా..?

మచిలీపట్నం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సుల్లో తరచూ వెండి, బంగారం అనధికారికంగా రవాణా అవుతోందన్న విమర్శలు ఎప్పటినుంచో వస్తున్నాయి. ఈ వ్యవహారాలపై రీజనల్ స్క్వాడ్ అధికారులు దృష్టి సారించారు. కానీ, కొందరు అధికారులు దీనిని తమ సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పక్కా సమాచారంతో బస్సులో ఎక్కిన రీజనల్ స్క్వాడ్ విశాఖ పట్నం వరకు ప్రయాణించింది. అక్కడ వెండిని పట్టుకుని సీజ్ చేసింది. బిల్లులు లేని వెండిని పెడనలో కూడా పట్టుకోవచ్చు. అయినా యజమానులు ఎవరో తెలుసుకోవడానికి విశాఖపట్నం వరకు వెళ్లారు. అలాంటపుడు సదరు యజమానులపై కేసు నమోదు చేయకుండా రావడమే ఈ ఆరోపణలకు ప్రధాన కారణం. అవినీతి మత్తులో జోగుతూ నిద్రపోతున్న విజిలెన్స్ ఇప్పటికైనా ఈ అంశంపై దృష్టి సారిస్తుందా లేదా వేచి చూడాలి.

దుర్గగుడిలో సీనియర్ అసిస్టెంట్‌పై వేటు

దేవినేని అవినాశ్‌కు అంతరాలయ దర్శనం ఎఫెక్ట్

- సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌పై విచారణ
- సెక్యూరిటీ ఇన్‌చార్జిపై చర్యలు

విజయవాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడి అధికారులు, సిబ్బంది వైసీపీ నేతల సేవల్లో తరిస్తున్నారు. కొద్దిరోజుల క్రితమే వైసీపీ నేత పోతిన మహేశ్‌తో పాటు 11 మందికి అంతరాలయం దర్శనాలు చేయించి, వేద ఆశీర్వచనాలు ఇవ్వడంపై పెద్ద దుమారమే రేగింది. ఇక మూలా నక్షత్రం రోజున వీవీఐపీలు సహా ఎవరికీ అంతరాలయం దర్శనం ఉండదని అధికారులు ముందే ప్రకటించారు. కానీ, వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ కుటుంబానికి అంతరాలయం దర్శనం కల్పించారు. ఈ దృశ్యాలను సీసీ కెమెరాల ద్వారా వీడియోవాల్‌పై గుర్తించిన అధికారులు సీనియర్ అసిస్టెంట్ రత్నారెడ్డిపై వేటు వేశారు. అంతరాలయం ముందు చిన్నగేటు ఉంటుంది. దీని తాళాలు తీసి అవినాశ్ కుటుంబాన్ని అంతరాలయంలోకి పంపారు. ఈ దృశ్యాలను వీడియో వాల్‌పై దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ గుర్తించారు. తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఈవో రామారావును ఆదేశించారు. తాళాలు తీసిన దృశ్యం స్పష్టంగా కనిపించడంతో తొలుత రత్నారెడ్డిని సస్పెండ్ చేశారు. అవినాశ్ కుటుంబం మహామండపం లిఫ్ట్ ద్వారా పైకి వచ్చినట్టు సమాచారం. ఆలయ సూపరింటెండెంట్‌గా హయగ్రీవరావు విధుల్లో ఉండగా, బయట విధులను జూనియర్ అసిస్టెంట్ బలరాం నిర్వర్తిస్తున్నారు. ఈ ఇద్దరిపై అంతర్గత విచారణ సాగుతోందని అధికార వర్గాలు తెలిపాయి. సెక్యూరిటీ ఇన్‌చార్జి నాగరాజును విధుల నుంచి తప్పించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఫుటేజీని కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, దేవదాయ కమిషనర్ సత్యనారాయణ మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పరిశీలిస్తున్నారు.

రూ.20 లక్షల విలువైన వాహనాల స్వాధీనం

- 38 ద్విచక్ర వాహనాలు కూడా..

ఎన్‌ఏసీలో మద్యం షాపుల లాటరీ

- కళాక్షేత్రం నుంచి మార్చిన అధికారులు

6లో

మంగళవారం నాటి ఆదాయం
రూ.69.02లక్షలు

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారి దసరా మహోత్సవాలు మంగళవారం నాటికి ఆరు రోజులు ముగిశాయి. మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా రూ.500 టిక్కెట్ల ద్వారా రూ.28,95,500, రూ.300 టిక్కెట్ ద్వారా రూ.7,05,300, రూ.100 టిక్కెట్ ద్వారా రూ.5,56,900 ఆదాయం సమకూరింది. 35,018 లడ్డూల ద్వారా రూ.5,25,270, ఆరు లడ్డూలు ప్యాకెట్ల ద్వారా రూ.20,02,200లు ఆదాయం సమకూరింది. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన రూ.3000 టికెట్ ద్వారా రూ.60వేలు, రూ.5000 టికెట్ ద్వారా రూ.30వేలు, పరోక్ష ప్రత్యేక చండీహోమం రూ.4వేల టికెట్ ద్వారా రూ.40వేలు, పత్యేక ఖడ్గమాల టిక్కెట్ ద్వారా రూ.5,116లు, పబ్లికేషన్‌లు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.5,112లు ఆదాయం సమకూరింది. తలనీలాల సమర్పణ రుసుము రూ.40 టిక్కెట్ ద్వారా రూ.77,560లు ఆదాయం వచ్చింది. మొత్తంగా కనకదుర్గమ్మవారికి రూ.69,02,958లు ఆదాయం సమకూరింది.







» ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు



» భక్తులతో ముచ్చటిస్తున్న హోంమంత్రి అనిత



» కొండపై సాంస్కృతిక సందడి..



» దుర్గగుడి ప్రాంగణంలో పోలీసు జాగిలంతో తనిఖీలు

మూలా నక్షత్రం.. క్యూలు కిటకిట

- అర్ధరాత్రి నుంచే అమ్మ దర్శన భాగ్యం
- ఫలించిన ముందస్తు ప్రణాళికలు
- శాఖలన్నీ సమన్వయం.. పదేళ్లలో మంచి ఫలితం
- ఏర్పాట్లు బాగున్నాయని సీఎం కితాబు



సరస్వతీదేవి దర్శనానికి బారులుతీరిన భక్తులు





సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తజనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్) : శరన్నవ రాత్రి మహోత్సవాలలో అత్యంత కీలకమైన మూలా నక్షత్రం నాడు ఎలాంటి వివాదాలు, ఆటంకాలు లేకుండా భక్తులు దుర్గమ్మను సరస్వతీ అలంకారంలో దర్శించుకున్నారు. ఎన్టీ ఆర్ జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళిక, పోలీసు, రెవెన్యూ దేవదాయశాఖల మధ్య సమన్వయం కారణంగా సామాన్య భక్తులు సైతం తమకు అసౌకర్యం కలిగిందని ఎక్కడా ఫిర్యాదులు రాకపోవడం విశేషం. మూలానక్షత్రం నాడు అన్ని టిక్కెట్ దర్శనాలను ఉచితం చేశారు. లక్షల్లో అమ్మవారిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించటంలో.. క్యూలైన్ల క్రమబద్ధీకరణలో అన్ని శాఖలు విజయం సాధించాయి.

అర్ధరాత్రి నుంచే భారీగా భక్తులు..

అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు మంగళవారం అర్ధరాత్రి నుంచే భారీగా తరలివచ్చారు. అర్ధ రాత్రి నుంచి ఉదయం వరకు అసాధారణంగా దర్శనాలు జరిగాయి. భక్తుల రద్దీ దృష్ట్యా వ్యవస్థలన్నీ ఏమాత్రం ఏమరపాటుగా లేకుండా వ్యవహరించడంతో ఎక్కడా ఇబ్బందులు తలెత్తలేదు. కార్పొరేషన్ దగ్గర నుంచి కంటెయినింగ్ జోన్లను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో భక్తులను ఈ ప్రాంతంలో హోల్డింగ్ చేశారు. ఆ తర్వాత క్యూలైన్లలోకి పంపారు. క్యూలలో తొక్కిసలాటను నివారించటానికి వీలుగా రోపులతో నిర్ణీత దూరం వరకు భక్తులను హోల్డ్ చేశారు. ఇలా రోజంతా హోల్డ్ చేయటం వల్ల ఎక్కడా తొక్కిసలాటకు అవకాశం ఇవ్వలేదు. మూలా నక్షత్రం రోజున గతంలో అమ్మవారి దర్శనానికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టేది. ఈ ఏడాది అనధికార దర్శనాలను పూర్తిగా నియంత్రించటంవల్ల కేవలం గంటన్నర వ్యవధిలోనే భక్తులు అమ్మ దర్శనం చేసుకున్నారు. క్యూలలో ఎలాంటి అసౌకర్యాలు కలగలేదు. భక్తుల డిమాండ్‌కు అనుగుణంగా మంచినీళ్ల ప్యాకెట్లను సిద్ధం చేశారు. లడ్డూ ప్రసాదాలను ముందస్తుగా సిద్ధం చేసి పెట్టుకోవటం వల్ల ఎలాంటి కొరతా ఏర్పడలేదు. ఈసారి రూ. 100కి ఆరు లడ్డూల ప్యాకెట్లను అందుబాటులోకి తీసుకురావటంతో వీటిని పెద్ద సంఖ్యలో కొనుగోలు చేశారు. కొండ దిగువన భక్తులు కొబ్బరికాయలు కొట్టుకోవడానికి వీలుగా ఏర్పాట్లు ఉండటంతో స్వేచ్ఛగా పూర్తి చేసుకున్నారు. మూలా నక్షత్రం రోజున ఎలాంటి సమస్యలు లేకపోవడంతో దేవస్థాన అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దీనికి తోడు వాతావరణం మేఘావృతంగా ఉండటంతో పాటు తుంపర చినుకులు పడటం వల్ల కూడా భక్తులు చల్లటి వాతావరణంలో దుర్గమ్మ దర్శనం చేసుకోగలిగారు. ఉదయం రెండు గంటల పాటు విపరీతమైన ఎండ వేసినా ఆ తర్వాత ఒక్కసారిగా నగరం మేఘావృతమైంది. ఓ భక్తురాలిపై పోలీసు అధికారి చేయిచేసుకోవటం తప్పితే ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. అనధికారిక దర్శనాలను పూర్తిగా నిలువరించగలిగారు. దేవస్థాన సిబ్బంది కొంతమేర అనధికార దర్శనాలు చేయించే ప్రయత్నం చేసినా.. చాలావరకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం వాటిని సమర్థవంతంగా అడ్డుకోగలిగింది. దీంతో దసరా ఉత్సవాలు మూలా నక్షత్రం రోజున ప్రశాంతంగా జరిగాయి. ఘాట్ మార్గాలు, కొండ దిగువన కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది సేవలు అందించారు. గతంలో మాదిరిగా చెప్పుల కుప్పలు కనిపించలేదు. దసరా ఉత్సవాలకు సంబంధించి జిల్లా యంత్రాంగం భక్తుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంది. ఈ ఫీడ్ బ్యాక్‌లో భక్తులు సంతృప్తికరంగా సమాధానాలు ఇచ్చారు. సౌకర్యాలకు సంబంధించి మంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించటానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఫీడ్ బ్యాక్ వివరాలను ప్రకటించి చాలా సంతృప్తిగా ఉందని చెప్పారు. మూలానక్షత్రం రోజున భక్తుల ఫీడ్ బ్యాక్ చూస్తే క్యూలైన్ల పరంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగితే 85 శాతం మేర సంతృప్తిగా ఉందని భక్తులు సమాధానం ఇచ్చారు. ఆలయ అలంకరణ ఏర్పాట్లకు సంబంధించి 92 శాతం ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పారిశుధ్యానికి సంబంధించి 87 శాతం, మంచినీటి బాటిళ్లు - వాటర్ ప్యాకెట్ల పంపిణీకి సంబంధించి 95 శాతం, ఉభయ దాతల పూజలకు సంబంధించి 94శాతం, వృద్ధులు - వికలాంగుల సేవలకు సంబంధించి 94శాతం లడ్డూ ప్రసాదాలకు సంబంధించి 93 శాతం, కేశఖండన సేవలకు సంబంధించి అత్యధికంగా 96శాతం మేర భక్తులు ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు.

పల్లకీలో ఊరేగిన ఆది దంపతులు..

లబ్బీపేట: వేలాది భక్తజనం మధ్య ఆదిదంపతులు పల్లకిలో ఊరేగుతూ దర్శనమిచ్చారు. లక్షలాదిగా భక్తులు క్యూ నుంచే నగరోత్సవాన్ని కన్నుల పండువగా తిలకించారు. కనకదుర్గానగర్ నుంచి ఘాట్‌రోడ్ మీదుగా ఊరేగింపు ఉత్సవం దేవస్థానంకు చేరుకుంది. దుర్గఘాట్‌లో కృష్ణమ్మ హరతులు చూసి భక్తులు తరించారు. మూల నక్షత్రం కావడంతో భారీగా విచ్చిన భక్తులు కృష్ణమ్మ హరతులను తిలకించి పులకించారు.


స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోండి

- రేపటి వరకు మద్యం దుకాణాల గడువు పొడుగింపు
- ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస చౌదరి



మాట్లాడుతున్న శ్రీనివాస చౌదరి

గన్నవరం, అక్టోబరు 9 : ఉమ్మడి కృష్ణాజిల్లాలో మద్యం దుకాణాలకు ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోవచ్చునని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాసచౌదరి అన్నారు. ఇప్పటివరకూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో 236 మద్యం దుకాణాలకుగాను 4633 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణాజిల్లాలో 123 షాపులు ఉన్నాయన్నారు. గన్నవరం ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ, దరఖాస్తులను మూడు పద్ధతుల్లో చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 8, కృష్ణాజిల్లాలో 8 స్టేషన్‌లలో నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. డీడీలు జతచేసి నిర్ణీత దరఖాస్తు పూర్తిచేసి అందించాలన్నారు. రెండో పద్ధతి పూర్తిగా ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకునే వీలుందన్నారు. క్రెడిట్, డెబిట్‌కార్డు ద్వారా రూ.2లక్షలు చెల్లించాలన్నారు. మూడో పద్ధతి హైబ్రీడ్ విధానంలో సీఎఫ్ఎంఎస్‌లో రూ.2లక్షలు చలానా చెల్లించి దాన్ని అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి దరఖాస్తులు తక్కువగా వస్తున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 11వ తేదీ వరకూ పొడిగించినట్టు చెప్పారు. 14వ తేదీన కృష్ణాజిల్లాకు మచిలీపట్నం నోబుల్ కళాశాల, ఎన్టీఆర్ జిల్లాకు ఇబ్రహీంపట్నం శ్రీ స్వర్ణ కళ్యాణ మండపంలో డ్రా తీయటం జరుగుతుందన్నారు. డ్రాలో వచ్చినవారికి లైసెన్స్‌లను కేటాయిస్తామని చెప్పారు. పలుచోట్ల సిండికేట్‌లుగా ఏర్పడి ఇతరుల దరఖాస్తులు వేయకుండా అడ్డుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎక్కడైనా దరఖాస్తుదారులను బెదిరించిన, అడ్డగించినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సదరు వ్యక్తులకు పోలీస్ భద్రత కల్పించి స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు, ఎక్సైజ్ సీఐ డి.సురేఖ తదితరులు పాల్గొన్నారు.



హిందూ కళాశాలను సందర్శిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధర్‌రావు, ఆర్డీవో స్వాతి తదితరులు

14న ఎక్సైజ్ దుకాణాల లాటరీకి ఏర్పాట్లు

- హిందూ పీజీ కళాశాలలో పరిశీలన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 : ఈనెల 14న మద్యం దుకాణాల లాటరీకిగాను మచిలీపట్నం హిందూ పీజీ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాంకులకు సెలవులు వచ్చినందున ఈనెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో 14వ తేదీన దుకాణాల లాటరీ తీసేందుకు హిందూ కళాశాల ప్రాంగణాన్ని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు, ఎక్సైజ్ అధికారులు భార్గవ్, ఎస్.నిక్సన్, ఆర్డీవో స్వాతి, తహసీల్దార్ పి.మధుసూధనరావు, ఆర్ఐలు శేఖర్, శ్యామ్‌లు పరిశీలించారు. హిందూ కళాశాల అనుబంధ సంస్థల చైర్మన్ కొనకళ్ల నారాయణ, పద్మావతి పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌తో ఏర్పాట్లపై ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు చర్చలు జరిపారు.

పంచాయతీలు బలోపేతం కావాలి

- ఇంటిపన్నుల బకాయిలు వసూలు చేయండి
- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ, హాజరైన అధికారులు

మచిలీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అధికారులు కృషిచేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. 'పీఆర్ వన్-విజిబుల్ ఎస్సెట్స్' అంశంపై జిల్లాపరిషత్ కన్వెన్షన్‌హాలులో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బుధవారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన పంచాయతీ రాజ్ వ్యవస్థను రానున్నరోజుల్లో మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక వనరులను ఉపయోగించుకుని అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఇంటిపన్నుల వసూలును నూరుశాతం చేస్తే ఆదాయం సమకూరుతుందన్నారు. దీర్ఘకాలంగా ఇంటిపన్నులు చెల్లించని వారి జాబితాలను తయారుచేసి తొలివిడతగా వారినుంచి బకాయిలు వసూలు చేయాలన్నారు. పురపాలకసంఘాలలో ఇంటిపన్ను సకాలంలో కట్టకుంటే కంప్యూటర్‌ద్వారా వడ్డీవేసే వెసులుబాటు ఉంటుందని, దీంతో పురపాలకసంఘాలలో ఇంటిపన్నులు అధికశాతం వసూలు అవుతాయన్నారు. పంచాయతీలలోనూ ఈ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చే ఆలోచన ప్రభుత్వం చేస్తోందన్నారు. పంచాయతీలలో ఇంటిపన్నుల రూపంలో వసూలైన నగదును సిబ్బంది జీతాలు, నిర్వహణ పనులకు ఉపయోగించి, మిగిలిన నగదును విజిబుల్ ఎస్సెట్స్‌కు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని తెలిపారు. గతనెల 23న జిల్లావ్యాప్తంగా పంచాయతీలలో సమావేశాలు నిర్వహించి ఏయే పనులు చేయాలో జాబితాలు తయారుచేశారని, ఆ పనులను ప్రాధాన్యతా క్రమంలో చేసేందుకు ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఈనెల 14నుంచి 21 వరకు నిర్వహించే పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఉపాధి పథకం ద్వారా ఆమోదం పొందిన పనులను ఈ వారోత్సవాలలో ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ప్రారంభించిన పనులకు సంబంధించిన వివరాలు, ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. పంచాయతీలలో సిమెంటు రహదారుల నిర్మాణాలకు ప్రణాళికను రూపొందించామని, రహదారులను నిర్మించిన తరువాత వాటిని నీటితో ఎంతమేర, ఎన్నిరోజులపాటు తడిపారనే అంశంపైనా, నాణ్యత ఎంతమేర పాటించారనే అంశంపైనా స్థానికులతో సంతకాలు తీసుకోవాలన్నారు. అధికారులు పనుల నాణ్యతను పరిశీలిస్తారని తెలిపారు. పంచాయతీలలో పనిచేసే పారిశుద్ధ్యకార్మికులకు సంబంధించిన మెడికల్ రిపోర్టులు పంచాయతీ కార్యదర్శి వద్ద, డీఎల్‌పీవోల వద్ద తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎవరైనా కార్మికులు అనారోగ్యంగా ఉంటే వారికి వైద్యం చేయించాలన్నారు. ప్రజాసమస్యలపై స్థానికంగా వచ్చే అర్జీలను ప్రతిరోజు పరిశీలించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీపీవో జె.అరుణ, జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుళ్లపల్లి జ్యోత్స్నకు ప్రముఖుల నివాళి



జ్యోత్స్న పార్థివదేహం వద్ద కుటుంబసభ్యుల నివాళి

విజయవాడ లీగల్, అక్టోబరు 9 : ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ సతీమణి, ఒకనాటి ఉద్యమ కార్యకర్త, నేటి తరుణీ తరంగాలు, సేఫ్ స్థాపనలో కీలక భూమిక వహించిన గుళ్లపల్లి జ్యోత్స్న (65) భౌతిక కాయాన్ని సీతారామపురంలోని ఆమె స్వగృహం వద్ద పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్, న్యాయమూర్తులు ఇందిర, నాగేశ్వరరావు, లక్ష్మి, శ్రీధర్, శ్రీదేవి, సీబీఐ కోర్టు న్యాయమూర్తి, మాజీమంత్రులు దేవినేని ఉమా, సీపీఎం నేతలు వి.శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబురావు, దోనేపూడి కాశీనాథ్, పి.మధు, సీఐటీయూ రాష్ట్ర నేతలు వి.ఉమామహేశ్వరరావు, వైసీపీ నేత దేవినేని అవినాశ్, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి వీవీ శేషసాయి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఐద్వా నాయకులు కాట్రగడ్డ స్వరూపరాణి, పి.రమాదేవి, చొప్పరపు శ్రీదేవి, కె.సరోజ, సీపీఐ నాయకులు అక్కినేని వనజ, జి.కోటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణమోహన్, బార్‌కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, ఎస్.మల్లేశ్వరరావు, ముప్పాళ్ల సుబ్బారావు, వీవీ కృష్ణారెడ్డి, బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ ఘంటా రామారావు, హైకోర్టు బార్ ప్రెసిడెంట్ కె.చిదంబరం, బెజవాడ బార్ మాజీ అధ్యక్షులు చేకూరి శ్రీపతి, కిలారు బెనర్జీ, భావన్నారాయణ, చోడిశెట్టి మన్మథరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యం, నగర ప్రముఖులు చలువాది మల్లికార్జునరావు, అమరావతి జేఏసీ నాయకులు సుధాకర్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు, టీడీపీ, వైసీపీ, బీజేపీ లీగల్‌సెల్ న్యాయవాదులు, ఐఏఎల్ నాయకులు షరీఫ్, సుధాకరరెడ్డి, కార్పొరేటర్‌లు చెన్నుపాటి ఉషారాణి, కుక్కల అనిత, విజయవాడలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయస్థాన సిబ్బంది, ఖమ్మం, నెల్లూరు, పశ్చిమగోదావరి, గుంటూరు తదితర జిల్లాల్లోని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్లూరి మాధవరావు, ఐలూ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, ఉభయ రాష్ట్రాల్లోని ఐలూ నాయకులు, సేఫ్ ఆర్గనైజేషన్ నాయకులు, కార్యకర్తలు, స్వర్గీయ జ్యోత్స్నతో ఉద్యమ సాన్నిహిత్యం వున్న అనేకమంది ప్రజలు, నాయకులు పాల్గొని నివాళులర్పించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ ఫోన్‌లో సుంకర రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించారు. ఐలూ నాయకులు సంపర శ్రీను, ఆలూరు సుధాకరరావు, వేము కోటేశ్వరరావు, సప్పా రమేష్, వి.రాజారత్నం, సీవీ సుబ్రమణ్యేశ్వరరావు తదితరులు జ్యోత్స్న పార్థివదేహానికి ఘనంగా నివాళులర్పించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జ్యోత్స్న పార్థివదేహాన్ని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల విద్యార్థుల పరిశోధన నిమిత్తం అప్పగించడం జరుగుతుందని ఆమె భర్త సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు.









నివాళులర్పిస్తున్న మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్, వామపక్ష నేతలు వనజ, శ్రీనివాసరావు, సీహెచ్ బాబూరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్

న్యూస్ బాక్స్



మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్

రూ.20 లక్షల విలువైన వాహనాల స్వాధీనం

కంకిపాడు, అక్టోబరు 9 : జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల చోరీకి గురైన ద్విచక్ర వాహనాలను భారీ మొత్తంలో స్వాధీన పరుచుకున్నట్టు ఎస్పీ గంగాధర్ తెలిపారు. స్థానిక స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, పెదపారుపూడి మండలానికి చెందిన అప్పికట్ల రాజీవ్ అలియాస్ కేరి నుంచి సుమారు రూ. 20లక్షల విలువైన 38 ద్విచక్ర వాహనాలను స్వాధీన పరుచుకోవడం జరిగిందని తెలియజేశారు. కంకిపాడు, చల్లపల్లి, గుడివాడ రూరల్, గన్నవరం, తోట్లవల్లూరు, పామర్రు, ఉయ్యూరు తదితర మండలాల పరిధిలో వాహనాల చోరీకి గురయ్యాయన్నారు. తోట్లవల్లూరులో 7, ఉయ్యూరు టౌన్‌లో 8, కంకిపాడులో 7, చల్లపల్లిలో 3, గన్నవరం, గుడివాడ రూరల్‌లో ఒక్కొక్కటి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వాహన చోరీలు అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా సుమారు 12వేల సీసీ కెమేరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కేసు విచారణలో పాల్గొన్న సీఐ మురళీకృష్ణ, ఎస్సై డి.సందీప్, సిబ్బందికి క్యాష్ అవార్డుతో పాటు సర్వీసు అవార్డును అందజేశారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఎన్ఏసీలో మద్యం షాపుల లాటరీ

విజయవాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల లాటరీని తీసే వేదికను మార్పు చేసినట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ గురునానక్ కాలనీలో నాక్ (ఎన్ఏసీ) కల్యాణ మండపంలో లాటరీ తీస్తామని పేర్కొన్నారు. తొలుత తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో లాటరీ తీయాలని భావించారు. శరన్నవరాత్రుల కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉండటంతో గొల్లపూడిలోని స్వర్ణకన్వెన్షన్ హాల్‌కు మార్చారు. ప్రభుత్వం తాజాగా దరఖాస్తులు చేసుకోవడానికి గడువును పెంచింది. 14వ తేదీన లాటరీ తీయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ రోజున కన్వెన్షన్ సెంటర్ ఇతరులకు బుక్కవ్వడంతో మళ్లీ వేదికను మార్పు చేశారు. గురునానక్ కాలనీలోని నాక్ కల్యాణ మండపంలో షాపుల కేటాయింపునకు సంబంధించిన డ్రా తీస్తామని డీసీ వివరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ

చిట్టినగర్: బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం కేఎల్ రావు పార్కు రోడ్డు సరస్వతీ ప్లాజా వద్ద వరద బాధితులకు నిత్యావసర సరకుల కిట్లు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ బిల్డర్ అసోసియేషన్ చైర్మన్ ఏ.నాగమల్లేశ్వరరావు, అసోసియేషన్ నాయకులు మధుసూదన్‌రెడ్డిలు పాల్గొని బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ శివకుమార్ పట్నాయక్, రాజశేఖర్, రాజు పాల్గొన్నారు.





స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ అంజనా సిన్హాకు అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న కమిటీ సభ్యులు



త్రిశక్తిపీఠంలో..




దత్తపీఠంలో



రాణిగారితోటలో..



మొగల్రాజపురం



సిద్ధార్థ కళాశాల గ్రౌండ్‌లో



శ్రీ మద్దిరావమ్మ తల్లి



శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద సామూహిక కుంకుమ పూజలు

చదువులతల్లి సరస్వతీదేవిగా మహాలక్ష్మి

●భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
●అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు

చిట్టినగర్, అక్టోబరు 9 : చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. సరస్వతీదేవి అలంకారంలోని మహాలక్ష్మీ అమ్మవారిని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ అంజనా సిన్హా దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు స్వాగతంపలికి దర్శనం చేయించారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కొత్తపేట శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలోని మంగళగౌరి అమ్మవారు, పాలఫ్యాక్టరీ చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కనే ఉన్న విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో విజయదుర్గా అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. కేఎల్ రావునగర్‌లో ఉన్న శ్రీ జంబులాంబదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీఎంసీ కాలనీలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు, పాలఫ్యాక్టరీ నాగమ్మ సత్రం ప్రాంతంలోని వీరాంజనేయస్వామి ధ్యానమందిరంలోని కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. చిట్టినగర్ వీరాంజనేయమార్కెట్‌లోని గంగానమ్మ అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు.

కృష్ణలంక: త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు.

పటమట: దర్శిపేటలోని రాజరాజేశ్వరి, లలితా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవిగా అలంకరించారు. వెలంపల్లి ఫౌండేషన్ సహకారంతో కొనకళ్ల విద్యాధరరావు నేతృత్వంలో బాలబాలికలకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. దత్తపీఠంలో మరకతరాజేశ్వరి దేవిని సరస్వతీదేవిగా అలంకరించి విద్యార్థుల చేత అక్షరాభ్యాసాలు చేయించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు.



హెచ్‌బీ కాలనీ షిర్డి ఆలయంలో



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో

రాణిగారితోట: రాణిగారితోటలోని శ్రీశ్రీశ్రీ మహాశక్తి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త అడపా శేషు మాట్లాడుతూ 11న అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, భక్తులు అమ్మ ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

భవానీపురం: హెచ్‌బీ కాలనీ సంకల్ప సిద్ది షిర్డి సాయిబాబా ఆలయంలో సరస్వతీదేవికి చిన్నారులతో అమ్మ చిత్రపటాలను పెట్టి కుంకుమ పూజలు జరిపారు. పూజలు అనంతరం 150 మంది చిన్నారులకు పుస్తకం, పెన్ను, బిస్కెట్లు, చాక్లెట్లను, ప్రసాదాల సంచితో పంపిణీ చేశారు. ముత్తైదువులు కుంకుమ పూజలు నిర్వహించారు.● ఊర్మిళానగర్‌లో గ్రామదేవత పోలేరమ్మ సరస్వతీదేవిగా భక్తులను అనుగ్రహించారు. చిన్నారులు పూజల్లో పాల్గొన్నారు.

మొగల్రాజపురం: మొగల్రాజపురం ధనకొండ మీద శ్రీశ్రీశ్రీ దుర్గా భవానీ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. మధురానగర్ మెయిన్ రోడ్డు రత్నా గార్డెన్స్‌లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. అమ్మవారిని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి దర్శించుకున్నారు.

పాతరాజరాజేశ్వరి పేట : 34వ డివిజన్ కేదారేశ్వరపేట శ్రీ శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 101 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజ చేపట్టారు.

విజయవాడ కల్చరల్: సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల గ్రౌండ్‌లో అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీ శత చండీ హోమాత్మక దశమహా విద్య హోమములు, గురుపూజ, గోపూజ, చండీ హోమాల్లో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. సువాసినులు కుంకుమార్చనలు నిర్వర్తించారు. విద్యార్థులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు కమిటీ సభ్యులు పుస్తకాలు పెన్నులు అందజేశారు.

భారతీనగర్: గుణదలలోని శ్రీ మద్దిరావమ్మ తల్లిని, కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనీయ దేవస్థానంలో అమ్మవారిని శ్రీ సరస్వతీదేవిగా అలంకరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వర్క్‌షాప్‌లో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు.



కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న బొండా ఉమా

అమ్మకృపతో ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో ఉండాలి

ఎమ్మెల్యే బొండా ఉమా

సత్యనారాయణపురం: సత్యనారాయణపురం కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, కన్యకాపరమేశ్వరి ఆలయంలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం అమ్మవారిని శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యంలో సరస్వతీ దేవిగా అలంకరించారు. పీఠం వ్యవస్థాపకులు అవ్వాహెమసుందర వరప్రసాద్ చేతుల మీదుగా పిఠాపురంకు చెందిన వేదపండితులచే రుద్రహోమం, లక్ష్మీగణపతి, చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి విద్యార్థులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చేగువేరాకు నివాళి

వన్‌టౌన్, అక్టోబరు 9: ప్రపంచ విప్లవ వీరుడు చేగువేరా 57వ వర్ధంతి సందర్భంగా వన్ టౌన్ లెనిన్ భవన్‌లో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర శాఖ ఆధ్వర్యంలో నివాళులు సమర్పించారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు కె.భార్గవ్, సహాయ కార్యదర్శి లంకే సాయి, నగర ఉపాధ్యక్షుడు చీరం రవి, నాయకులు షేక్ అబ్దుల్, ఖయ్యూం, తదితరులు చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేగువేరా జీవిత ప్రస్థానాన్ని నాయకులు గుర్తుచేసుకున్నారు.



చేగువేరా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

వైద్యం, ఫీజు నిమిత్తం ఇద్దరికి ఆర్థిక సాయం

పటమట, అక్టోబరు 9 : టీడీపీ ఒక రాజకీయ పార్టీగానే కాకుండా ఒక స్వచ్ఛంద సేవా సంస్థలా పనిచేస్తుందని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. బుధవారం ఉదయం అశోక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో వైద్యం, చదువు నిమిత్తం ఇద్దరికీ రూ.20వేల ఆర్థిక సహాయాన్ని గద్దె క్రాంతికుమార్ అందజేశారు. 17వ డివిజన్‌కు చెందిన తన్నేరు కనకరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు, ఆరో డివిజన్ చుట్టుగుంటకు చెందిన సీహెచ్ భరణికి కాలేజీ ఫీజు నిమిత్తం రూ.10వేలు అందజేశారు.

దుర్గమ్మ దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, అక్టోబరు 9 : ఇంద్రకీలాద్రిపై వున్న కనకదుర్గమ్మ చల్లని చూపుతో రాష్ట్రంలోని ప్రజలు సుఖ సంతోషాలతో వుండాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కృష్ణలంక 21వ డివిజన్‌లోని వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే గద్దె బుధవారం పాల్గొని సరస్వతీ దేవి అలంకారంలో వున్న అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్న సంఘం సభ్యులను ఆయన అభినందించారు. ఉత్సవ కమిటీ సభ్యులకు గద్దె రామ్మోహన్ మనుమరాలు గద్దె రానియా పేరు మీద రూ.25 వేలు విరాళంగా గద్దె అందచేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ఏటా వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. దుర్గాదేవి దయతో రాష్ట్రం ప్రజలు సుఖఃసంతోషాలతో ఉండాలన్నారు. గత ఏడాది జరిగిన దసరా వేడుకల్లో వచ్చే ఎన్నికల్లో మంచి ప్రభుత్వం రావాలని కోరుకున్నామని, అనుకున్నట్లుగానే 2024లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోను అభివృద్ధిపథంలో పయనించేలా చేస్తారని గద్దె తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెరుమాళ్ల గురునాథం, సభ్యులు పందేటి అశోక్ కుమార్, పాదర్తి విజయ గణేష్, మట్టా సుబ్బారావు, శనగపల్లి మల్లిఖార్జున్, నంబూరి లోకేష్ గుప్తా, నేరెళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గద్దెను సత్కరిస్తున్న వాసవీ సేవా సంఘం సభ్యులు

పటమట చినవంతెన సెంటర్‌లో అన్నదానం

విజయవాడ స్పోర్ట్స్ : పటమట చినవంతెన సెంటర్‌లో కనకదుర్గమ్మ దసరా ఉత్సవాల్లో భాగంగా ఎన్ఏసీ కల్యాణమండపం అధినేతలు నల్లూరి కాశీ, నల్లూరి అఖిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. కనకదుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని, హైదరాబాద్‌ను తలదన్నేలా అమరావతి అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు

భవానీపురం, అక్టోబరు 9 : ఆటో, టిప్పర్ యూనియన్ కార్మికులంతా ఐక్యంగా ఒక తాటిపై నడిస్తే వారి సమస్యలను పరిష్కరించడానికి అహర్నిశలు తాను పనిచేస్తానని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు భరోసా ఇచ్చారు. సితార సెంటర్ సమీపంలో శ్రీ విజయ దుర్గా ఆటో, టిప్పర్ యూనియన్ అసోసియేషన్ కార్యాలయాన్ని గొట్టుముక్కల టీఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరించి బుధవారం ప్రారంభించారు. యూనియన్ అధ్యక్షుడు మల్లిశివ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన కొబ్బరికాయ కొట్టి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన సెంట్రల్ ఆంధ్రా కన్వీనర్ బాడిత శంకర్, టీడీపీ మాజీ జిల్లా నాయకులు గంగవరపు మురళీ, జనసేన నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రెంటపల్లి శ్యామ్‌ప్రసాద్, నాయకులు లింగంపల్లి మోహన్‌రావు, పరుచూరి ప్రసాద్‌లు పాల్గొన్నారు.

పంప్‌హౌస్ నిర్మాణ పనుల పరిశీలన

చిట్టినగర్, అక్టోబరు 9: 47వ డివిజన్ చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం ప్రాంతంలో నూతన బూస్టర్ రూమ్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు కూటమి నేతలు నాగోతి రామారావు, వేంపల్లి గౌరిశంకర్‌లు తెలిపారు. సమస్యను తాము సుజనా చౌదరి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన నూతన పంప్‌హౌస్ నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులకు తెలిపారన్నారు. దీంతో గత నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన పనులను బుధవారం పరిశీలించామని నాయకులు చెప్పారు. బూస్టర్ పంపు నిర్మాణం అయితే లంబాడీపేట, టీనర్ పేట, యానాదుల కాలనీ వాసులకు పూర్తిస్థాయిలో తాగునీరు అందుతుందని చెప్పారు. ఎమ్మెల్యే సుజనా బూస్టర్ రూమ్ నిర్మాణానికి రూ.5లక్షల నిధులు విడుదల చేశారన్నారు.

వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



పాయకాపురం, అక్టోబరు 9: స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం ప్రశాంతి నగర్‌లోని సమితి కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ 100 వరద బాధిత కుటుంబాలకు, పారిశుధ్య కార్మికులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇమ్మానేని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వరద బాధితులకు సహాయం అందించడానికి విరాళాలు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు డి. మురళి, కె. నరసింహమూర్తి, ఎల్. దుర్గ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరుద్ర సహిత ద్విశత చండీయాగం

వన్‌టౌన్, అక్టోబరు 9: కేబీఎన్ కళాశాల ఆవరణలో ఉన్న శ్రీదాసాంజనేయస్వామివారి దేవస్థానం ప్రాంగణంలో శ్రీరుద్ర సహిత ద్విశత చండీయాగం బుధవారం ఏడోరోజు శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీకన్యకా పరమేశ్వరి విస్సంశెట్టి వెంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సుమారు 108 మంది చండీయాగంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలను నిర్వహించారు. వెయ్యి మంది మహిళలు ఈ పూజలో పాల్గొన్నారు. సుహాసిని పూజలను నిర్వహించారు. మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొమ్మంద్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబా విజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసు పాల్గొన్నారు.





పాత శివాలయంలో ..

స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయం (పాత శివాలయం)లో బుధవారం సరస్వతీదేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

వెంకటేశ్వరస్వామి గుడిలో...

వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవస్థానం ఈవో సన్యాసిరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు రాము, అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128,137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.525

జ్యోత్స్నకు ఘన నివాళి

తిరువూరు, అక్టోబరు 9: రోడ్డుప్రమాదంలో మృతి చెందిన అమరావతి బాలోత్సవం కార్యదర్శి జ్యోత్స్న మృతికి బాలోత్సవం కమిటీ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ్యులు జ్యోత్స్న చిత్రపటానికి పూల మాల వేసి నివాలులర్పించారు. అమరావతి బాలోత్సవం కార్యక్రమాలు విజయవంతంలో ఆమె పాత్ర ఎనలేనిదని వక్తలు కొడియాడారు. ఎన్నో సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆమె మృతి తీరనిలోటన్నారు. బాలోత్సవం సభ్యులు కె.పాపారావు, ఎం.హరి కృష్ణ, రామకృష్ణ, పంతంగి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బాలోత్సవం కమిటీ సభ్యులు

పోస్టుమాస్టర్‌కు సన్మానం

గానుగపాడు(తిరువూరు), అక్టోబరు 9 : మండలంలోని గానుగపాడు గ్రామంలో ప్రపంచ తపాలా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయుడు మందడపు రాంప్రదీప్ మాట్లాడుతూ ఒకప్పుడు ఒకరి యోగక్షేమాలు, మరొకరికి తెలియజేసేందుకు ఉత్తరాలు విని యోగించేవారన్నారు. ఉత్తరాలను ఆయా గమ్యస్థానాలకు చేర్చడంలో పోస్టల్ సిబ్బంది ఎంతో శ్రమ పడేవారన్నారు. తాపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పోస్టుమాస్టర్ ఎం.హెచ్‌వివి ప్రసాద్‌ను పోస్టల్ సిబ్బంది సన్మానించారు.



అంబారుపేటలో సత్యమ్మ అమ్మవారు..



జగ్గయ్యపేటలో..



తిరువూరులో..



పెనుగంచిప్రోలులో..

వీణాపాణి నమోనమః

● ఆలయాల్లో సరస్వతీదేవీగా అమ్మవారు ● భక్తుల ప్రత్యేక పూజలు

నందిగామరూరల్, అక్టోబరు 9: అంబారుపేట గ్రామంలోని సత్యమ్మ అమ్మవారు సరస్వతీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో హరిగోపీనాథ్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అమ్మవారికి కుంకుమార్చనలు, సహస్రనామ పూజలు చేశారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ జ్ఞానసరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. కనకమహాలక్ష్మీ అమ్మవారు, లింగాలపాడు గ్రామంలోని లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారు, పట్టణంలోని సువశ్యామలాంబ, వాసవీ కన్యకా పరమేశ్వరీ, మరిడీ మహాలక్ష్మీ అమ్మవార్లను అర్చకులు సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, కూడలి సంగమేశ్వర స్వామి ఆలయాలలో అమ్మవార్లకు అర్చకులు పూజలు చేశారు.

నందిగామ : రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారికి, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి, మరిడి మహలక్ష్మీ అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేశారు. తెల్లవారుజాము నుండే భక్తులు బారులు తీరి అమ్మవార్లను దర్శించుకున్నారు.

గొల్లపూడి: గొల్లపూడి సాయిపురం కాలనీలోని షిర్డి సాయిబాబా మందిరంలో బుధవారం అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచారు. ఆలయ అధ్యక్షుడు రావూరి కిషోర్ చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

గంపలగూడెం: ఊటుకూరు కోదండ రామాయలంలోని రాజ్యలక్ష్మి అమ్మవారు, నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారు సరస్వతీదేవీగా దర్శనమిచ్చారు. మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలోని గజలక్ష్మి అమ్మవారు విద్యాలక్ష్మిగా, గంపలగూడెం రామాలయంలో దుర్గాదేవి సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు.

తిరువూరు: స్థానిక శాంతి నగర్‌లోని కనదుర్గ ఆలయంలోని అమ్మవారిని బుధవారం సరస్వతిదేవిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు, ఆలయ అర్చకులు గోపి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అష్టలక్ష్మి, గౌరికేదారేశ్వరస్వామి ఆలయాల్లో, రామలింగేశ్వరస్వామి, కోదండ రామాలయం, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించి పుజలు నిర్వహించారు.



చిట్టా లక్ష్మీనరసింహాశాస్త్రిని సత్కరిస్తున్న కౌన్సిలర్ సంగెపు బజ్జి

విస్సన్నపేట: విస్సన్నపేట కనకదుర్గమ్మ ఆలయం, పుత్రేల మారెమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారు సరస్వతి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎస్సై పి.రామకృష్ణ దంపతులు దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ నిర్వహకులు ఎస్సైకు స్వాగతం పలికి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జగ్గయ్యపేట రూరల్: ముక్త్యాలలో భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్ సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఈవో సురేష్ పర్యవేక్షించారు. అనుమంచిపల్లిలో తొర్రకుంటపాలెనికి చెందిన భవానీ కూచిపూడి డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థినులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది.

జగ్గయ్యపేట: పట్టణంలోని నకాసి బజార్ కనకదుర్గ దేవస్థానంలో, వెండి దేవాలయంలో అక్షరాభ్యాసాలు చేయించేందుకు తమ పిల్లలతో తల్లిదండ్రులు హాజరయ్యారు. దుర్గాపురంలో దుర్గాదేవి, నకాసి బజార్ కనకదుర్గ, చెరువుబజార్ రేణుక పరమేశ్వరీ, కన్యక పరమేశ్వరీ, మహాలక్ష్మి అమ్మవారు సరస్వతీ అలంకారంలో దర్శనమిచ్చారు. కన్యకపరమేశ్వరీ అమ్మవారిని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పట్టణంలోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానం నుంచి బలుసుపాడులో గల గురుధామ్ ధర్మక్షేత్రం వరకు పాదయాత్రగా వెళ్లి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు గురుధామ్ వ్యవస్థాపకుడు, తాత్వికులు గెంటేల వెంకట రమణను కలిసి ఆశీర్వచనం తీసుకున్నారు. తాతయ్య సోదరుడు శ్రీరాం చిన బాబు, శ్రీవల్లి దంపతులు, కుమారుడు కిట్టు, రాష్ట్ర తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికారసంస్థ అధ్యక్షురాలు ఆచంట సునీత, మండల టీడీపీ అధ్యక్షులు నరసింహారావు, సీతారామయ్య, మండల సమైక్య అధ్యక్షురాలు రాజ్యలక్ష్మీ, కౌన్సిలర్ సంధ్యారాణి, రజిని, కే.సూర్యప్రకాశ్, కే. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులోని ఆలయాల్లో బుధవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. వడ్డెరపల్లెలోని అమ్మవారి విగ్రహం వద్ద బుధవారం రాత్రి అన్నదానం చేశారు. సామూహిక అక్షరాభ్యాసం చేసి పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి , డిప్యూటీ కమిషనర్ బి.హెచ్.వి.ఎ్ ఎ.ఎ.కిషోర్ కుమార్, ఆలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాస రావు, ధర్మకర్తలు బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

రాయిగూడెం రహదారికి మరమ్మతులేవి?

● కోతకు గురైన రహదారి ● ప్రయాణికులకు, పాదచారులకు తప్పని తిప్పలు

లక్ష్మీపురం(తిరువూరు), అక్టోబరు 9: మండలంలోని లక్ష్మీపురం శివారు రాయిగూడెం గ్రామానికి వెళ్ళే జిల్లా పరిషత్ రహదారి ప్రమాదకరంగా మారింది. లక్ష్మీపురం నుంచి రాయిగూడెం, కొకిలంపాడు గ్రామాలకు గట్టుచెరువు కట్టమీదుగా ఉన్న రహదారిని, గతంలో తారురోడ్డుగా అభివృద్ధి చేశారు. గత నెలలో సంభవించిన వరదలకు గట్టుచెరువు పూర్తిగా వరదనీటితో నిండటంతో చెరువుకట్టపై నిర్మించిన రోడ్డు కొతకు గురయ్యింది. రాయిగూడెంతో పాటుగా, కోకిలంపాడు, కొత్తలక్ష్మీపురం, గ్రామాల ప్రజలు ఈరోడ్డుమీదుగానే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం వివిధ గ్రామాలకు వెళుతుంటారు. వరదలకు రోడ్డు భారీగా కొట్టుకుపోవడంతో ఈ రహదారిపై రాకపోకలకు ఆయా ప్రాంతల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, పాదచారులు రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు రాకపోకల సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదానికి గురవక తప్పడం లేదు. చెరువుకట్ట మీద రోడ్డు కొతకు గురికావడంతో ఈ గ్రామంలో ఆటోలు సైతం రాకపోవడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు నరకయాతన పడాల్సి వస్తోంది. పాలకులు, అధికారులు దృష్టి సారించి, ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన రాయిగూడెం రహదారి

ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు

పెనుగంచిప్రోలు, అక్టోబరు 9 : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపసర్పంచ్‌లకు, వార్డుసభ్యులకు మండల స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యాతిథులుగా జడ్పీటీసీ వూట్ల నాగమణి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.శ్రీను పాల్గొన్నారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ పరిపాలన, వ్యర్థాల నిర్వహణ, ఆస్తుల సంరక్షణ, ఆక్రమణల తొలగింపులు, వీధి దీపాల నిర్వహణ, కేంద్ర ప్రభుత్వాల పథకాలు , తదితర అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా అధికారి కె.సిద్ధారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పి.భాను ప్రసాద్ , రీసోర్స్ పర్సన్ ఎన్.రామకృష్ణ, పాల్గొన్నారు. ఈ శిక్షణ తరగతులకు టిఓటిలుగా పంచాయతీ కార్యదర్శులు జి.శ్యామ్ కుమార్ ఏ.నరేష్ వ్యవహరించారు.



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు

రెడ్డిగూడెం: మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీల ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు బుధవారం నుంచి ప్రారంభించినట్టు ఎంపీడీవో టి.కె.వి రమణ తెలిపారు. పారిశుధ్య, వీధి దీపాల నిర్వహణ తదితర వాటిపై వారికి శిక్షణనిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ దేవానంద్, పంచాయతీ కార్యదర్శులు రామారావు, భాస్కర్, రాజు, వెంకటేశ్వర్లు, ఫణిశ్రీ, లక్ష్మి నారాయణ, రాజేష్, యువరాజ్, సాయి, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు జాబితాల ప్రదర్శన

● రైతుల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి : ఏవో పి.పద్మ



రైతులకు పలు సూచనలు ఇస్తున్న ఏవో పి.పద్మ

ముష్టికుంట్ల(తిరువూరు), అక్టోబరు 9 : మండలంలో 8406 మంది రైతులకు సంబంధించి, 22755 ఎకరాల్లో వేసిన వివిధ పంటలు ఈ-క్రాప్‌నమోదు చేశామని ఏవో పి.పద్మ తెలిపారు. బుధవారం మండలంలోని ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించి వివిధ పంటల సస్య రక్షణ చర్యలు వివరించారు. ఈ-క్రాప్ నమోదుకు సంబంధించిన జాబితాలన్నీ రైతుసేవాకేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ఉంచామన్నారు. రైతుల జాబితాలను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే రైతుసేవా కేంద్రాల్లో కాని, సచివాలయాల్లో లిఖితపూర్వకంగా అందించాలని సూచించారు. అభ్యంతరాలు సరిచేసిన తదుపరి ఈనెల 18న తుదిజాబితా ప్రకటిస్తామన్నారు. రైతులు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని ఎవో సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



గండిని పూడ్చిస్తున్న టీడీపీ నేత మధుసూదనరావు

గండ్లకు మరమ్మతులు

వీరులపాడు: గత నెలలో కురిసిన వర్షాలకు, వరదలకు పెద్దాపురం గ్రామంలో ఏనుగుగడ్డ వాగుకు గండి పడింది. దీంతో ప్రజలు , రైతులు రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రజల ఇబ్బందులను చూసిన తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నాయకుడు దాములూరు మధుసూదనరావు తన సొంత నిధులతో బుధవారం మరమ్మతులు చేయించారు. పది రోజుల క్రితం ఆర్‌అండ్‌బి రహదారిపై పడిన గండ్లను సైతం ఆయన తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు.ఈమేరకు ఆయనకు ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పు అడిగినందుకు దాడి

గంపలగూడెం : పాతకక్షలు పురస్కరించుకొని ఓ వ్యక్తిపై బుధవారం పలువురు వ్యక్తు లు దాడి చేసి గాయపరిచారు. మేడూరు గ్రామానికి చెందిన యుద్దనపుడి గోపాలకృష్ణ అనే వ్యక్తి నాలుగు రోజు ల క్రితం అదే గ్రామానికి చెందిన బరిగెల రామకృష్ణను తీసుకున్న అప్పు కు సంబంధించిన డబ్బు అడినందుకు తీవ్రంగా గాయపరిచాడు. ఈవ్యవహారాన్ని దృష్టిలో పెట్టుకొని పొలం నుంచి వస్తున్న గోపాలకృష్ణపై రామకృష్ణ తండ్రి నాగేశ్వరరావు, సోదరుడు వేణు తదితరులు దాడి చేసి గాయపరిచారు. గాయపడిన గోపాలకృష్ణను ఆసుపత్రికి పంపి కేసు నమోదు చేసి ఎస్సై శ్రీను దర్యాప్తు చేస్తున్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

మహిళా సమైక్య కార్యవర్గం

జగ్గయ్యపేట : పట్టణ మహిళా సమైక్య నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం మెప్మా కార్యాలయంలో సీఎంఎం ఏ.సత్యవతి పర్యవేక్షణలో జరిగింది. అధ్యక్షురాలుగా షేక్ నజీమూన్, వైస్ ప్రెసిడెంట్ కాకాని పావని, సెక్రటరిగా గోనెల పద్మావతి, జా యింట్ సెక్రటరిగా అనుపర్తి పద్మావతి, కోశాధికారిగా కోమటి ఝాన్సీలను సమైక్య సభ్యులు ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు నజీమూన్ మాట్లాడుతూ పురపాలకసంఘ పరిధిలో అన్ని సమైక్యలను బలోపేతం చేసి, సభ్యులకు అన్ని ప్రభుత్వ పథకాలను అందేలా చూస్తామని చెప్పారు.

జగ్గయ్యపేటలో 560 దరఖాస్తులు

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 4 దుకాణాలకు 158మంది దరఖాస్తులు చేసుకున్నా రు. మండల పరిధిలో 4 దుకాణాలకు 194, వత్సవాయిలో 2 దుకాణాలకు 208 దరకాస్తులు అందినట్టు ఎక్సైజ్ సీఐ గురవయ్య చెప్పారు.



జగన్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న తన్నీరు

జగన్‌కు తన్నీరు ఆహ్వానపత్రిక

జగ్గయ్యపేట : మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని మాజీ కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు తాడేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం సాయంత్రం కలిశారు. ఈ నెల 16న విజయవాడ పోరంకిలో మురళీ రిసార్ట్స్‌లో జరగనున్న తన కుమార్తె సారూప్య వివాహానికి రావాలని కోరారు. అనంతరం ఆహ్వానపత్రికను అందించారు.

సబ్సిడీపై ఉల్లి, టమాట

జగ్గయ్యపేట: పట్టణంలోని నూతన రైతుబజార్‌లో బుధవారం సబ్సిడిపై రూ.50లకు టమాటా, రూ.35లకు ఉల్లిగడ్డల విక్రయాన్ని ఎస్టేట్ ఆఫీసర్ రమణ ప్రారంభించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

దుప్పట్లు, పౌష్టికాహారం పంపిణీ

జగ్గయ్యపేట : కర్లపాటి ఛారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యం లో బుధవారం హెచ్ఐవీ బాధిత పిల్లలకు దుప్పట్లు, పౌష్టికాహారాన్ని ట్రస్టు అధ్యక్షులు కర్లపాటి శ్రీనివాసరావు శ్రేయస్సు ప్రతినిధులకు అందజేశారు.